సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



ముమ్మరంగా తనిఖీలు
ఎలక్షన్ కోడ్ వచ్చాక జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీల జోరు పెంచారు. దీంతో రూ. లక్షల్లో నగదు, బంగారం పట్టుబడుతోంది.
- 10లో ▸



బోధన్ టు కర్ణాటక
బోధన్‌లోని రెంజల్‌లో వరికోతలు ఊపందుకున్నాయి. వ్యాపారులు మిర్యాలగూడ నుంచి వచ్చి వడ్లను కొని కర్ణాటకకు తరలిస్తున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.4 /22.5

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల కోడ్‌పై నిర్లక్ష్యమేల?

- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో పార్టీ కార్యకలాపాలు



నిజామాబాద్‌నాగారం : ఎన్నికల కోడ్ వచ్చి వారం రోజుల గడుస్తున్నా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఇంకా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం కోడ్ రాగానే ప్రభుత్వపరంగా ఉన్న పీఏలను కూడా తొలగించాల్సి ఉంటుంది. దీంతో పాటు క్యాంప్ కార్యాలయం కూడా మూసి ఉంచాలి. రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మూసి ఉంచారు. అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మాత్రం తెరిచి ఉండడంపై విమర్శలు వస్తున్నాయి.

జీజీహెచ్‌పై నుంచి దూకి వృద్ధురాలి ఆత్మహత్య



ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని రెండో అంతస్తు ఆయుష్మాన్ వార్డు పైనుంచి దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఎల్లారెడ్డి మండలం జనగాయిపల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ (65) అనే వృద్ధురాలు అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. ఆమెను రెండవ అంతస్తులోని ఆయుష్మాన్ వార్డులో అడ్మిట్ చేశారు. అయితే సోమవారం ఉదయం 4 గంటలకు రత్నమ్మ జీజీహెచ్‌లోని రెండవ అంతస్తు పైనుంచి దూకగా ఘటనాస్థలంలోనే మృతి చెందింది. సిబ్బంది వెంటనే 1వ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి వివరాలు సేకరించారు. అనారోగ్యాన్ని తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

జిల్లాకు వచ్చిన ఏఐసీసీ పరిశీలకులు

ఖలీల్‌వాడి : నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌కు ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, ఎంపీ రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించేందుకు ఏఐసీసీ పరిశీలకులు జిల్లాకు వచ్చారు. ఆర్మూర్‌లో పబ్లిక్ మీటింగ్, చెరుకు, పసుపు రైతులతో సమావేశం జరిగే ప్రాంతాలను ఏఐసీసీ పరిశీలకులు విష్ణునాథ్, రోహిత్ చౌదరి, కాంగ్రెస్ రాష్ట్ర నేత వేంనరేందర్ రెడ్డి పరిశీలించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వినయ్ కుమార్ రెడ్డితో వివరాలను తెలుసుకున్నారు. నిజామాబాద్‌లోని ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన తర్వాత మంగళవారం ఉదయం బోధన్‌లో గల్ఫ్ కార్మికులు, బీడీ కార్మికులతో సమావేశ ప్రాంతం, నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతాలను ఎంపిక చేస్తారు. అలాగే నగరంలో జరిగే రాహుల్ గాంధీ పాదయాత్ర స్థలాలను పరిశీలిస్తారు. వీరి వెంట టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హుందాన్, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత శేఖర్‌గౌడ్ ఉన్నారు.

జంపింగ్ జపాంగ్

శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో జిల్లాలో సమీకరణాలు మరింత వేగంగా మారుతున్నాయి. అందరికంటే ముందుగా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లాలో వరుసగా మూడోసారి సిట్టింగ్‌లకే టికెట్లిచ్చింది. కాంగ్రెస్ పార్టీ మాత్రం మొదటి విడతలో మూడు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ నేడో రేపో మొదటి జాబితా విడుదల చేయనుంది. అయితే తాజాగా పార్టీలు మారుతున్న వారితో సమీకరణాలు మారే అవకాశాలు లేకపోలేదు.



- బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన తూము శరత్‌రెడ్డి దంపతులు
- 'గులాబీ'కి పార్టీకి రాజీనామా చేసిన ఆకుల లలిత
- కాంగ్రెస్ గూటికి మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు !
- మరోవిడత కాంగ్రెస్ టికెట్ల కేటాయింపుపై ప్రభావం చూపనున్న తాజా సమీకరణాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో తమకు ప్రత్యర్థులుగా కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎవరు అభ్యర్థులుగా వస్తారో అనే టెన్షన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఉత్కంఠగా చూస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీలు సైతం పరస్పరం ఎదుటి పార్టీ ఏ అభ్యర్థిని బరిలోకి దించనుందనే లెక్కలు వేసుకుంటూ అందుకనుగుణంగా ప్రణాళికలు మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలో అధికార బీఆర్‌ఎస్‌లోకి పెద్దగా చెప్పుకోదగిన నాయకులు చేరలేదు. మరోవైపు కాంగ్రెస్‌లోకి మాత్రం బీఆర్‌ఎస్ నుంచి చేరికల పర్వం మొదలవుతోంది.

బోధన్ నియోజకవర్గం నుంచి షురూ..

బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ, ఆమె భర్త అయిన కౌన్సిలర్ శరత్‌రెడ్డి, మరో ఏడుగురు కౌన్సిలర్లు సోమవారం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో శరత్‌రెడ్డి అనుచరులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బోధన్ పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు సమయంలో ఎమ్మెల్యే షకీల్, శరత్‌రెడ్డి మధ్య వార్ మొదలైంది. తర్వాత ఫ్లెక్సీ వార్ నడిచింది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే షకీల్‌పై హత్యాయత్నం చేశారంటూ ఎంఐఎం కౌన్సిలర్లతో పాటు శరత్‌రెడ్డిపైనా కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో షకీల్, శరత్‌రెడ్డి మధ్య అగాథం పెరిగింది. శరత్‌రెడ్డితో నియోజకవర్గంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు టచ్‌లో ఉన్నారు. ఈ స్థానిక ప్రజాప్రతినిధులు కూడా విడతలవారీగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేలా శరత్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సుదర్శన్‌రెడ్డితో కలిసి ఈ విడతలవారీ ప్రణాళిక రూపొందించారు. షకీల్‌ను ఎట్టిపరిస్థితుల్లో ఓడిస్తానని శరత్‌రెడ్డి పంతం పట్టడం గమనార్హం.

కాంగ్రెస్ వైపు ఆకుల లలిత..


2018లో ఎమ్మెల్సీగా ఉన్న ఆకుల లలిత కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోసారి ఎమ్మెల్సీగా అవకాశమిస్తానని కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేరలేదు. రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. అప్పటి నుంచి లలిత అసంతృప్తితోనే ఉన్నారు. తాజాగా సోమవారం ఆమె బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. బంగారు తెలంగాణలో భాగస్వామి అయ్యేందుకు బీఆర్‌ఎస్‌లో చేరినప్పటికీ అక్కడ తగిన 'ఆత్మగౌరవం' లేదని, పరిపాలన వికేంద్రీకరణకు సంబంధించి 'స్వయంపాలన' లేకుండా పోయిందంటూ కేసీఆర్‌కు రాసిన రాజీనామా లేఖలో లలిత పేర్కొన్నారు. లేఖలో 'ఆత్మగౌరవం', 'స్వయంపాలన' అనే పదాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు అనేక ఇబ్బందులు సృష్టించారన్నారు.

స్థానిక ప్రభుత్వాల ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యేలకు బానిసలుగా చేశారని, కేవలం ఎమ్మెల్యేల ప్రభుత్వాలు అనేలా చేయడం శోచనీయమన్నారు. సర్పంచ్‌ల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. పాలన వికేంద్రీకరణ అనేది లేకుండా చేయడంతో పాటు ఎమ్మెల్యేలకు జవాబుదారీతనం లే కుండా చేశారన్నారు. ఇలాంటి నేపథ్యంలో బంగారు తెలంగాణ సాధ్యం కాదని పేర్కొన్నారు. తిరిగి ప్రజాసేవకు పునరంకితం అయ్యేందుకు రాజీనామా చేస్తున్నట్లు లేఖలో వివరించారు. అయితే అర్బన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ ఆ పార్టీలో లలిత చేరనున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ రూరల్ రేసులో మాజీ మంత్రి మండవ..?

జిల్లాకు చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది. మండవ 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో కేసీఆర్ ఆహ్వానం మేరకు బీఆర్‌ఎస్‌లో చేరారు. మండవ చేరినప్పటికీ కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఎంపీగా బీజేపీ అభ్యర్థి అర్వింద్‌పై ఓటమిపాలు కావడం గమనార్హం. కాగా తాజాగా ఆదివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌లో మండవ ఇంటికి వెళ్లి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. మండవకు నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. టిక్కెట్ల కేటాయింపు పూర్తయ్యేలోగా జిల్లాలో మరిన్ని రాజకీయ సమీకరణలు మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

స్పష్టత కరువు



నిజామాబాద్ అర్బన్ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి అయోమయం నెలకొంది. గత కొన్నేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను ఎట్టకేలకు ఇటీవల బదిలీ చేశారు. కాని రిలీవ్ చేయడంలో మాత్రం అవాంతరాలు నెలకొన్నాయి. చాలా మంది ఉద్యోగులు బదిలీ అయిన పాత స్థానంలోనే కొనసాగుతున్నారు. దీంతో జిల్లాలో బదిలీల ప్రక్రియ సరైన పద్ధతిలో కొనసాగక హెచ్‌ఎంలు అయోమయానికి గురవుతున్నారు.

జిల్లాలో..

జిల్లాలో ఇటీవల 1,093 మంది స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు చేశారు. వీరిని బదిలీ అయిన స్థానాలకు వెళ్లాలని సూచించారు. కాని పదోన్నతులు లేనిదే బదిలీలు వద్దంటూ కొందరు కోర్టుకు వెళ్లారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే జిల్లాలో స్కూల్ అసిసెంట్ల బదిలీలు పూర్తయ్యాయి. కోర్టు ఇటీవల 19వ తేదీ వరకు బదిలీల ప్రక్రియను నిలిపేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంతలోనే జిల్లాలో 1,093 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. కాని బదిలీ అయిన స్థానంలో కొత్తవాళ్లు వస్తేనే మిమ్మల్ని రిలీవ్ చేస్తామంటూ హెచ్‌ఎంలు పేర్కొంటున్నారు. ముందే రిలీవ్ చేస్తే సంబంధిత సబ్జెక్టు బోధించడంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని హెచ్‌ఎంలు పేర్కొంటున్నారు. బదిలీ అయిన తర్వాత దుబ్బ పాఠశాలలో 8 మంది టీచర్లు రిలీవ్ అయ్యారు. మళ్లీ వారి స్థానంలో వేరే వారు వచ్చేందుకు ఆలస్యం ఉండడంతో సంబంధిత హెడ్‌మాస్టర్ వారిని వెనక్కి పిలిపించారు. ముచ్కూర్ పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. బినోల పాఠశాలలో ఇద్దరు టీచర్లను రిలీవ్ చేశారు. నందిపేట మండలంలో కొందరు టీచర్లు రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం అక్కడ సంబంధిత సబ్జెక్టు చెప్పే టీచర్ అందుబాటులో లేరు. విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో మొదట క్యాడర్ వారీగా పరిగణలోకి తీసుకొని రిలీవ్ చేయాలని ఆదేశించారు. మరికొన్ని చోట్ల స్టేషన్ వైస్ పరిగణలోకి తీసుకొని రిలీవ్ చేశారు. ఉన్నతాధికారులు కూడా రెండోసారి సమావేశంలో స్టేషన్ వైస్ పరిగణలోకి తీసుకున్నారు. ఇలా స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో స్కూల్ అసిస్టెంట్లు రిలీవ్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 950 మంది స్కూల్ అసిస్టెంట్లు రిలీవ్ కాక అలాగే ఉండిపోయారు. కొందరు హెచ్‌ఎంలు నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేశారని ఇటీవల వరంగల్ ఆర్‌జేడీ పలువురు అక్కడి హెచ్‌ఎంలకు మెమోలు జారీ చేసినట్లు తెలిసింది.

కాంగ్రెస్‌లోకి మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

- వారితో పాటు చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు

బోధన్ : బీఆర్‌ఎస్‌కు చెందిన బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ, ఆమె భర్త కౌన్సిలర్ శరత్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు సోమవారం హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్‌రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు, కౌన్సిలర్లకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులతో పాటు కౌన్సిలర్లు తాళ్లలత, శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యం, మీర్ నజీర్ అలీ(డబ్బు), అబ్దుల్లా, జావిద్, ఇమ్రాన్, నాయకుడు రవిచంద్ర, సాలంపాడ్ క్యాంప్ సర్పంచ్ తూము అంజమ్మ, రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్‌గౌడ్ ఉన్నారని పార్టీ నాయకులు తెలిపారు. బోధన్‌కు చెందిన పార్టీ ము ఖ్య నాయకులు గంగాశంకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అల్లెలా వణ్య రమేష్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ, శరత్‌రెడ్డికి కండువా కప్పుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



చిత్తూచిత్తూల బొమ్మ..

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. బోధన్‌లోని సాలూర మండల కేంద్రంలో సోమవారం అక్కడి ఆచారం ప్రకారం సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. - బోధన్

దుర్గమ్మకు లక్ష గాజుల వైభోగం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించారు. సోమవారం గాయత్రి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



వరద కాలువతో ప్రయోజనాలెన్నో..

అదనపు కలెక్టర్ యాదిరెడ్డి



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను సద్వినియోగపర్చడం కోసం గొప్ప ఆశయంతో వరద కాలువను నిర్మించారని , ఈ కాలువతో ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్ర శివారులో వరద కాలువ జీరో పాయింట్ వద్ద కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయం సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వరదకాలువ మిగులు జలాలే కాకుండా ప్రాజెక్ట్‌లోకి కాళేశ్వరం నీరు వచ్చేలా రెండు దారులు ఏర్పడ్డాయన్నారు. దీంతో వరద కాలువలో ఏడాదంతా నీళ్లుంటాయని, ప్రధానంగా ఆయకట్టు రైతుల మధ్య జలవివాదాలు లేకుండా పోయిందన్నారు. వరద కాలువ ద్వారా నీటిని సద్వినియోగం చేసి 2.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరివ్వడమే లక్ష్యమన్నారు. అందులో భాగంగానే గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్మించారన్నారు.

ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ విస్తీర్ణం కోసం కాలుష్య నియంత్రణ మండలి నుంచి క్లియరెన్స్ రావాలన్నారు. అందుకోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. అనంతరం ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపుహౌజ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ ప్రసాద్ కృష్ణ, వరద కాలువ ఈఈ సుధాకిరణ్, డిప్యూటీ ఈఈ గణేశ్, ఏఈఈ రామారావు, తహసీల్దార్ వనజరాణి, ఆర్‌ఐ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

వెలవెలబోయిన కార్యక్రమం



ప్రజాభిప్రాయ సేకరణ అనేది కేవలం బోర్డుపై రాయడానికే పనికొచ్చేలా మాత్రమే ఉపయోగపడిందని చెప్పవచ్చు. నలుగురికి మించి రైతులు హాజరు కాలేదు. ప్రజలకు మచ్చుకు ఒక్కరు కూడా కనిపించలేదా.. ప్రజలకు గాను, రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని చూస్తే అర్థమవుతుంది. దీంతో అధికారులు వారికి వారే మాట్లాడుకుని సమావేశాన్ని మమ అనిపించారు.

అభ్యర్థులందరినీ గెలిపించుకుంటాం

ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్ : నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీని గెలిపించుకుంటామని ఎంపీ అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో బీజేపీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏడు నియోజకవర్గాల్లో బీజేపీకి, బీఆర్‌ఎస్‌కు మధ్యే ప్రధానంగా పోటీ నెలకొందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే రైతులను ఇక్కట్ల పాలు చేస్తున్న ధరణిని తొలగిస్తామన్నారు. ఓటర్లు కూడా ఆలోచించి అవినీతికి పాల్పడుతున్న పార్టీలకు కాకుండా బీజేపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. పసుపు బోర్డును సాధించామన్నారు. దీంతో రైతులకు పసుపు ధర గణనీయంగా పెరిగి లాభపడతారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే యూపీ, కర్ణాటకలో మూతపడ్డ చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించినట్లుగా ఇక్కడ కూడా చక్కర ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు. అంతకు ముందు పూణే ఎమ్మె ల్యే సిద్దార్థ మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, యామాద్రి భాస్కర్ పటేల్ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్



క్లుప్తంగా

అమరవీరులకు డీసీపీ నివాళి



ఖలీల్‌వాడి: పోలీసు అమరవీరుల వారోత్స వాల సందర్భంగా కమిషనరేట్‌ పరిధిలోని అమరులైన పోలీసు కుటుంబాలను అదనపు డిప్యూటీ కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ (లా అండ్‌ ఆర్డర్‌) జయరాం సోమవారం పరామర్శిం చారు. పోలీస్‌ సిబ్బంది వారి కుటుంబసభ్యు లను కలిసి అమరుల ఫొటోలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులతో ప్రభుత్వం నుంచి అందిన సహాయ సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ నరహరి, ఎస్‌బీ సీఐ జె.గన్నంతర్‌రావు, ఏఎస్సై రాఘవేందర్‌, పోలీస్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు షకీల్‌ పాషా ఉన్నారు.

తంగేడు పూవుల్ల చందమామ..



తంగేడు పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతె పోతివిగాని చందమామ
మల్లెప్పుడొస్తావు చందమామ
యాడాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
బీరాయి పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
గునిగీయ పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివిగాని చందమామ
మల్లెప్పుడొస్తావు చందమామ
యాడాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
కాకర పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతె పోతివిగాని చందమామ
మల్లెప్పుడొస్తావు చందమామ
యాడాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
కట్లాయి పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతె పోతివిగాని చందమామ
మల్లెప్పుడొస్తావు చందమామ
యాడాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
రుద్రాక్ష పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతె పోతివిగాని చందమామ
మల్లెప్పుడొస్తావు చందమామ
యాడాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
గుమ్మడి పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతె పోతివిగాని చందమామ
మల్లెప్పుడొస్తావు చందమామ
యాడాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ

– నిజామాబాద్‌ సిటీ

ముమ్మరంగా తనిఖీలు

- ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో సరిహద్దుల్లో పెరిగిన నిఘా
- ఇప్పటి వరకు రూ.80 లక్షలు, 60 తులాల బంగారం పట్టివేత
- వాహనాల తనిఖీల్లో భారీ సొమ్ము స్వాధీనం
- ఆందోళన వద్దంటున్న పోలీసులు



జిల్లా కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌, సీఐ నరహరి (ఫైల్‌)



బోధన్‌లో పట్టుబడిన నగదును సీజ్‌ చేసి మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌ (ఫైల్‌)

ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికల కోడ్‌ అమల్లోకి రావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల నిత్యం వాహనాల తనిఖీ చేపడుతోంది. మద్యం, డబ్బులతో రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోబపర్చేందుకు అవకాశం ఉన్నందున పోలీస్‌శాఖ అప్రమత్తమై వాటి నివారణకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో పోలీస్‌, ఇతర శాఖల అధికారులు చెక్‌ పోస్టులను ఏర్పాటు చేసి మద్యం, నగదు రవాణాకు కట్టడి చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ. 80 లక్షల నగదు, 40 తులాల బంగారం పట్టుబడగా అధికారులు స్వాధీనం చేసుకొని సీజ్‌ చేశారు.

రసీదులు వెంట ఉండాలి

వాహనదారులు, ప్రజలు తమ వెంట రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు తీసుకెళ్తే తప్పనిసరిగా రసీదు, బిల్లులు సంబంధిత అధికారులు, పోలీసులకు చూయించాలి. లేకుంటే ఆ నగదును సీజ్‌ చేసే అవకాశం ఉంది. ఆధారాలు లేకుండా నగదు పొందాలంటే ఎంసీఎంసీ కమిటీని ఆశ్రయించాల్సి ఉంటుంది. కమిటీ వాటిని పరిశీలించిన తర్వాత నిర్ధారణ అయితే వాటిని తిరిగి ఇస్తారు. లేకుంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

వ్యాపారంలో ఒప్పందపత్రాలు..

వ్యాపార లావాదేవీలు చేసేవారు నగదుకు సంబంధించిన రసీదులు తమ వద్ద ఉంచుకోవాలి. ఈ నగదు మొత్తం చట్టబద్ధమై, వ్యాపార లావాదేవీలకు సంబంధించినదై ఉంటేనే అనుమతి ఇస్తారు. భూములు, ఇండ్ల అమ్మకాలు కొనుగోలు వారికి నగదు లావాదేవీలు ఎక్కువగా జరుగుతుంటాయి. దీంతో రిజిస్ట్రేషన్‌ సమయంలో నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అధికారులు, పోలీసులు తనిఖీలు చేసినప్పుడు దానికి సంబంధించిన వివరాలు చూయించాలి. అంతేకాకుండా పెండ్లిలు, ఆసుపత్రిల ఖర్చుల కోసం పెద్ద మొత్తంలో ప్రజలు డబ్బులు తీసుకెళ్తుంటారు. ఈ నగదు, బంగారం పట్టుబడితే ఇన్‌కంట్యాక్స్‌కు సంబంధించిన వివరాలు లేకుంటే దానికి సంబంధించిన ట్యాక్సులు తీసుకొని మిగతాది ఇచ్చే అవకాశం ఉంది.

సరిహద్దులో నిరంతర నిఘా..

జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్‌, ఇతర శాఖల అధికారులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు పని చేస్తున్నాయి. సాలూరా, కందకుర్తి, ఖండ్‌గావ్‌, పోతంగల్‌లో అంతరాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి మద్యం, నగదు రాకుండా పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నారు. ఈ బృందంలో ఐదుగురితో కలిసి ఏర్పాటు చేయగా ఇందులో పోలీసు, రెవెన్యూతోపాటు ఇతర శాఖల అధికారులు ఉంటారు. రెండు బృందాలు ఉదయం, రాత్రి వేళల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఈ చెక్‌ పోస్టుల వద్ద 24 గంటల నిఘా ఉంటుంది.

ప్రత్యేక బృందాలతో..

ఆర్మూర్‌టౌన్‌: ఎన్నికల కోడ్‌ అమలు కావడంతో నియోజకవర్గంలో పోలీసులు వాహనాల తనిఖీని విస్తృతంగా చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం రూ. 50వేల కన్నా ఎక్కువ నగదు తీసుకెళ్తే అధికారులు పట్టుకొని సీజ్‌ చేస్తున్నారు. ఆర్మూర్‌ నియోజకవర్గంలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాలుగు ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు, నాలుగు చొప్పున వీడియో వీవీ టీం, సర్వోలెన్స్‌, స్టాటిక్‌ బృందాలను ఏర్పాటు చేసి వీరి ద్వారా నియోజక వర్గంలో నిత్యం పర్యవేక్షణ కొనసాగుతోంది. నాలుగు ప్రధాన కేంద్రాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి జాతీయ రహదారి, అంతర్గత రోడ్లపై తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల కోడ్‌అమలులోకి వచ్చిన నాటి నుంచి అధికారుల తనిఖీల్లో ఇప్పటి వరకు సుమారు రూ.11లక్షల23వేల నగదు, 14.80 తులాల బంగారాన్ని పట్టుకొని సీజ్‌ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎన్నికల అధికారులు సూచించిన నిబంధనల ప్రకారం ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. పోలీసులు, అధికారులతో కలిసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపడుతున్నాం. రూ. 50వేలకు మించి డబ్బులు తీసుకెళ్తే సరైన పత్రాలు చూయించాలి లేకుంటే సీజ్‌ తప్పనిసరి.

– వినోద్‌కుమార్‌, ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్మూర్‌

ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి



మద్నూర్‌లో ఎన్నికల సిబ్బందితో సమావేశమైన రిటర్నింగ్‌ అధికారి మనుచౌదరి

మద్నూర్‌: శాసన సభ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌, ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి మను చౌదరి సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్‌ కార్యాలయంలో సోమవారం ఎన్నికల అధికారులు, సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి సిబ్బంది సహకరించాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు, ఇతర కార్యక్రమాల కోసం అనుమతి తప్పనిసరని చెప్పారు.

స్ట్రాంగ్‌ రూంల పరిశీలన

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూం ఏర్పాటు, నామినేషన్‌ ప్రక్రియ, వివిధ ఏర్పాట్ల గురించి ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి మను చౌదరి పరిశీలించారు. మద్నూర్‌లోని స్ట్రాంగ్‌ రూం పరిసరాల్లో పకడ్బందీ నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌, జిల్లా చెక్‌పోస్టలలో నిఘా విభాగంతో పాటు వీడియో రికార్డింగ్‌ తీపిస్తున్నామన్నారు.

ఆన్‌లైన్‌లో నామినేషన్‌ వేయచ్చు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్‌ వేయవచ్చని మను చౌదరి తెలిపారు. తహసీల్‌ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్‌ వేసే విధానాన్ని ఈ సంవత్సరం తీసుకొచ్చినట్లు ఆయన తెలియజేశారు. ప్రచారానికి అనుమతులు పొందాలంటే 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తహసీల్దార్‌ మహమ్మద్‌ ముజీబ్‌, డిప్యూటీ తహసీల్దార్‌ భరత్‌, ఆర్‌ఐ శంకర్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ విజయ్‌, సిబ్బంది ముస్తఫా, సతీష్‌ ఉన్నారు.

సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా జట్టు



విజేతగా నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి సీనియర్‌ మహిళా సాఫ్ట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌ టోర్నమెంట్‌లో జిల్లా మహిళా జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 15, 16వ తేదీల్లో హన్మకొండ కాకతీయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌ టోర్నమెంట్‌ నిర్వహించారు. ఫైనల్‌లో సిద్దిపేట జట్టుపై గెలిచి చాంపియన్‌షిప్‌ను జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో బెస్ట్‌ క్రీడాకారిణిగా జిల్లాకు చెందిన రాణిని రాష్ట్ర కార్యదర్శి నవీన్‌ జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఉపాధ్యక్షుడు శోభన్‌ బాబు క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌ మేనేజర్‌గా వ్యవహరించిన నరేశ్‌, సంతోష్‌, గంగాధర్‌, సాయికిరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్‌, స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ ముత్తన్న, సంగీత్‌రావు, నీరజారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్‌, మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌, జైపాల్‌రెడ్డి, మర్కంటి సుజాత, చిప్ప నవీన్‌, సూపరి వినోద్‌, జైడి రాజ్‌ కుమార్‌, బక్కూరి పవన్‌, నాగమణి, నల్లూరి లత, ప్రేమలత, భూపతి, మధు, అనిల్‌, సురేశ్‌, స్వప్న, జ్యోత్స్న, మౌనిక పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి హారిక

నాగిరెడ్డిపేట: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎల్లారెడ్డి డివిజన్‌ కోర్టు జూనియర్‌ సివిల్‌ జడ్జి హారిక అన్నారు. సాధన సంస్థ ఆధ్వర్యంలో 'బాల్యవివాహ రహిత దేశం' అనే అంశంపై మండలంలోని పోచారంలో సోమవారం రాత్రి అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. పోచారం గ్రామాన్ని బాల్య వివాహ రహితగ్రామంగా మార్చాలన్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్రవంతి, స్వర్ణలత, చందన, సర్పంచ్‌ విజిత, ఎంపీటీసీ సభ్యురాలు వినీత, సాధన సంస్థ డైరెక్టర్‌ మురళీమోహన్‌, ఎస్సై రాజు, శ్రీనివాస్‌, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌ టు కర్ణాటక

- మిర్యాలగూడ నుంచి వస్తున్న దళారులు
- అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా

రెంజల్‌: ఈ సీజన్‌లో వర్షాలు ఆలస్యమైనా వరి సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్త మవుతోంది. స్థానికేతర వ్యాపారులతో ఇప్పటికే రైతులు ఆశాజనకమైన ధరకు ధాన్యం విక్రయిస్తున్నా రానురాను పరిస్థితి ఎలా ఉంటుందోనని వరి పొట్టదశలో ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా వరి నాట్లు పూర్తి చేసిన ప్రాంతాల్లో రైతులు వారం, పది రోజుల నుంచి నూర్పిళ్లు చేపట్టగా మిర్యాలగూడకు చెందిన ప్రైవేట్‌ వ్యాపారులు పంటపొలాల వద్దకే వచ్చి పచ్చిధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు 3 కిలోల తరుగు తీసుకుని ప్రభుత్వ మద్దతు ధరకన్నా అదనంగా చెల్లిస్తుండడంతో పాటు రైతులకు హమాలీ, గన్నీ బ్యాగుల డబ్బులు దక్కుతున్నాయి. స్థానికేతర వ్యాపారులు ఈ ప్రాంత రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఈ సీజన్‌లో వరి మద్దతు ధర ఏ–గ్రేడ్‌ రకానికి రూ.2203, బీ–గ్రేడ్‌ రకానికి రూ.2183గా నిర్ణయించింది. మిర్యాలగూడ వ్యాపారులు క్వింటాలుకు 3 కిలోల తరుగు తీసుకుని రూ. 2200 నుంచి 2400 వరకు చెల్లిస్తున్నారు. దీంతో రైతుకు ధాన్యాన్ని ఆరబెట్టడం, గన్నీ బ్యాగుల కోసం పరుగులు, కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షణ తప్పుతోంది.

కొనుగోళ్లకు ముందుకురాని దళారులు

పెట్టుబడి లేని వ్యాపారం కావడంతో గ్రామాల్లో దళారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. గతంలో పలువురు రైతులను నిలువునా ముంచి చివరకు డబ్బులు చెల్లించక ఐపీలు తీసుకొన్న ఘటనలున్నాయి. జిల్లాలో మొదటిసారిగా మిర్యాలగూడ నుంచి వ్యాపారులు వచ్చి రైతులకు అదనపు ధర అందిస్తుండడంతో దళారులకు గిట్టుబాటు దక్కక కొనుగోళ్లకు ముందుకు రావడం లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన మిల్లర్లు మిర్యాలగూడ వ్యాపారుల ద్వారా ఇక్కడి నుంచి ధాన్యాన్ని తరలించుకుపోతున్నారు. మరి కొందరు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి కమీషన్‌ చూసుకుని విక్రయిస్తున్నారు.

అంతా విచిత్రమే..



ఓ రైతుగా సమావేశంలో మాట్లాడుతున్న ఆఫీస్‌ బాయ్‌ శివ

బాల్కొండ: మండలంలోని వరద కాలువ జీరోపాయింట్‌ వద్ద కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్‌ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఎన్నో చిత్ర, విచిత్రాలు చోటు చేసుకున్నాయి. అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి ఎదుటే పునరుజ్జీవన పథకం పంప్‌ హౌస్‌లో ఆఫీస్‌ బాయ్‌గా పనిచేసే శివని ముందుగా రైతుగా పరిచయం చేశారు. ఆయన రైతుగానే సమావేశంలో వేదిక వద్ద వచ్చి వరద కాలువ నిర్మాణంతో తమకు మంచిగానే ఉందని.. రెండు పంటలు పండిస్తున్నామంటు తెలిపాడు. మైక్‌ నిర్వాహకుల చేతికి అందడమే ఆలస్యం వెంటనే సమావేశం వద్ద టీ సిద్ధం చేసి అదే అదనపు కల్టెర్‌కు అందించాడు. అయినా అధికారులు పట్టించుకోలేదు. పంప్‌ హౌస్‌ వద్ద ఆఫీస్‌ బాయ్‌, క్లీనర్స్‌ను ముందే రైతులుగా అధికారులు తయారు చేసి మాట్లాడించారు. ఇదే ప్రజాభిప్రాయ సేకరణ అంటు అధికారులు ముగించారు. ఇదంత చూసినా అదనపు కలెక్టర్‌ చూస్తూ ఊరుకున్నారు. దీంతో సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

దాడిలో ఒకరి మృతి

నవీపేట: మండల కేంద్రంలోని మార్కెట్‌ ప్రాంగణంలో ఆదివారం జరిగిన దాడిలో గాయపడ్డ బాధితుడు సోమవారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సాయిరాం(50) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. మార్కెట్‌ ప్రాంగణంలో మద్యం సేవిస్తుండగా అదే గ్రామానికి చెందిన నాగరాజు మద్యం పోయాలని బలవంతం చేశాడు. దీంతో తాను మద్యం పోయనని సాయిరాం తెలుపడంతో నాగరాజు అతని కుమారుడు గణేశ్‌ దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ సాయిరాం సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘర్షణ జరిగిన ప్రాంగణాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్‌ పరిశీలించారు. మార్కెట్‌ ప్రాంగణంలో ఎవరైనా మద్యం సేవిస్తే కేసు నమోదు చేయాలని ఎస్సైని ఆదేశించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులోని కెమికల్‌ ఫ్యాక్టరీలో ఈనెల 11న జరిగిన ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడు జగదీశ్‌పాల్‌(40)హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ల్యాబరేటరీలో సాల్వెంట్‌ డ్రమ్ములను అన్‌లోడ్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు ప్రమాదం సంబవించడంతో ఆపరేటర్లుగా పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన బబ్లూ అదే రోజు మృతి చెందగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన జగదీశ్‌ పాల్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

CPGET-2023 QUALIFIED
Student choose web option 2nd phase dates 14-10-2023 to 17-10-2023 in Vijetha Degree & PG College and Managements seats available Regular PG Courses.
M.Sc.Botany,Zoology, Computer, MA Telugu
Contact: 9848011253,9490512234
Vijetha Degree & PG College, Armoor

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER
■ కంపెనీ ప్రొవైడ్‌ అన్ని రకముల బిజినెస్‌, ప్రాపర్టీ, పర్సనల్‌, అగ్రికల్చర్‌, టేకోవర్‌ కొరకు DSA & ఏజెంట్స్‌ కావలెను. Salary + Commission. ఫోన్‌ : 9990752820 [HA-31102]

WANTED
■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్‌ కొరకు వర్కర్స్‌ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్‌ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]
■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీతం: 18K. Ph: 9640400073 / 9848571888 [H-189342]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్‌
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్‌

బెల్ట్‌షాపులపై దాడి

ఖలీల్‌వాడి/ పెద్దకొడప్‌గల్‌/ మోపాల్‌/ ఇందల్వాయి/ బోధన్‌ రూరల్‌: నగరంలోని ఆరోటౌన్‌ పీఎస్‌ పరిధిలోని అర్సపల్లి, డైరీఫాం సమీపంలో బెల్ట్‌ షాపుల దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్‌ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి చేసినట్లు పేర్కొన్నారు. మూడో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని హమాల్‌వాడిలో చిట్టబోయిన శంకర్‌ ఇంట్లో రూ. 15290 విలువ చేసే మద్యం స్వాధీనం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ వెల్లడించారు.

పెద్దకొడప్‌గల్‌ మండలంలోని బేగంపూర్‌లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఏఎస్సై రాములు పేర్కొన్నారు.

మోపాల్‌ మండలంలోని చిన్నాపూర్‌, గుడితండా, కాస్‌బాగ్‌తండాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై దాడి చేసినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందల్వాయి మండలంలోని గౌరారం, ఇందల్వాయి తండా, వెంగల్‌పాడ్‌ గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. దాడుల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బోధన్‌, సాలూర మండలాల్లోని పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌ షాప్‌లపై సోమవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు రూరల్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. సాలూర, పెంటకుర్దు క్యాంపు, నాగన్‌పల్లి, కొప్పర్గ, ఊట్‌పల్లి గ్రామాల్లో బెల్ట్‌ షాప్‌లపై దాడులు నిర్వహించి సుమారు రూ.25వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో కరుణవ్వ మల్లవ్వ(45) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు సోమవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం గైని గ్రామానికి చెందిన పేమయ్య, కరుణవ్వ ఇద్దరు వారం రోజుల క్రితం కూతురి అనారోగ్యం నిమిత్తం జీజీహెచ్‌ ఆసుపత్రికి వచ్చారు. ఆదివారం రాత్రి కరుణవ్వ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మల్లవ్వ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

సదాశివనగర్‌: కుప్రియాల్‌ గ్రామంలో గంగపుత్ర సంఘానికి సంబంధించిన పిల్లర్లను రెడ్డి సంఘాల సభ్యులు ధ్వంసం చేశారంటు తహసీల్దార్‌ హిమబిందుకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో నాలుగు రెడ్డి సంఘాలకు చెందిన భవనాలను నిర్మించుకున్నారని, తమ గంగపుత్ర సంఘానికి సంబంధించిన భవనం నిర్మించకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రెడ్డి సంఘ భవనాలను సీజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తానని తహసీల్దార్‌ హామీ ఇచ్చినట్లు గంగపుత్ర సంఘం సభ్యులు తెలిపారు. సంఘం ప్రతినిధులు బట్టు గంగారాం, చిన్న నర్సింలు, రవీందర్‌, సుదర్శన్‌, నడిపి గంగయ్య, చిన్న గంగయ్య, బట్టు నర్సింలు, కిశోర్‌ లింగం తదితరులు పాల్గొన్నారు.

భారీగా నగదు స్వాధీనం



పోచారంలో నగదును పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ఖలీల్‌వాడి/నాగిరెడ్డిపేట/దోమకొండ: నగరంలోని సారంగపూర్‌ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.6.87 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్‌ సోమవారం తెలిపారు. తనిఖీల్లో వెంకటరమణారెడ్డి అనే వాహనదారుడి నుంచి రూ.5,22,920, రాజేందర్‌గౌడ్‌ నుంచి రూ.1.65 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.80వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్‌, ఎస్సై రాజు తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరి నుంచి రూ. 2లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై మురళి పేర్కొన్నారు. వేల్పూర్‌ మండలం పడగల్‌ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో ప్రయాణిస్తున్న జగిత్యాలకు చెందిన అనిల్‌రావు నుంచి రూ. లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపారు.

తెగిపడిన విద్యుత్‌ తీగలు



చిన్నపూల్‌ బ్రిడ్జి వద్ద తెగిపడిన విద్యుత్‌ తీగలు

నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌నగర్‌ మండలంలోని నర్వ గ్రామ సమీపంలో విద్యుత్‌ స్తంభాన్ని వద్ద లోడ్‌తో వెళ్తున్న లారీ సోమవారం ఢీకొన్నది. దీంతో విద్యుత్‌ స్తంభం నేలకొరగడంతో కరెంట్‌ తీగలు ఒక్కసారి తెగి రోడ్డుపై పడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన వాహనదారులు ముందుకు వెళ్లకుండా ఆగిపోయాడు. దీంతో ప్రమాదం తప్పింది. అప్పటికే కరెంట్‌ తీగలు ఒకదానికొటి తగిలి మంటలు చెలరేగాయి. స్తంభాన్ని ఢీకొన్న లారీ డ్రైవర్‌ వేగంతో అక్కడి నుంచి తప్పించుకున్నాడు. స్థానికులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్‌ సరఫరాను నిలిపివేశారు. లారీ కోసం ట్రాన్స్‌కో అధికారులు, పోలీసులు గాలిస్తున్నారు.

యంచలో చెక్‌ పోస్ట్‌ ప్రారంభం



యంచలో చెక్‌ పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నిజామాబాద్‌ ఏసీపీ కిరణ్‌కుమార్‌ సోమవారం ప్రారంభించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ సరిహద్దు ప్రాంతంలోని ఎక్సైజ్‌ చెక్‌పోస్ట్‌ స్థానంలోనే ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. నిజామాబాద్‌ నార్త్‌ జోన్‌ సీఐ సతీశ్‌, ఎస్సై యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

చీమన్‌పల్లిలో..

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి వై జంక్షన్‌ వద్ద అంతర్‌ జిల్లా చెక్‌ పోస్టును ఏసీపీ కిరణ్‌కుమార్‌ సోమవారం ప్రారంభించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్రమంగా డబ్బు, మద్యం సరఫరాను నివారించేందుకు రాజన్న సిరిసిల్ల సరిహద్దు వద్ద చెక్‌ పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధర్పల్లి సీఐ సైదా, ఎస్సై రమేశ్‌ ఉన్నారు.

పలువురి బైండోవర్‌

రెంజల్‌/ మోపాల్‌: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18 మందిని తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్‌ సోమవారం తెలిపారు. గత ఎన్నికల్లో కేసు నమోదైన వారిని గుర్తించి ముందస్తుగా బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు.

మోపాల్‌ మండలంలో సిర్‌పూర్‌, ఎల్లమ్మకుంట గ్రామాలకు చెందిన 17 మందిని తహసీల్దార్‌ ఖాజా ఖు ద్బుద్దీన్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఏఎస్సై దయాళ్‌సింగ్‌ సోమవారం తెలిపారు. వీరిపై గ తంలో కేసులు నమోదు కాగా, పాత నేరస్తులుగా పరిగణించి బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

నందిపేట్‌: ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరి నిందితులకు ఆర్మూర్‌ జ్యుడిషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ వేముల దీప్తి ఒక సంవత్సరం జైలు శిక్షను విధించినట్లు ఎస్సై రాహుల్‌ సోమవారం తెలిపారు. మండలంలోని చౌడమ్మ గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో గత సంవత్సరం నిందితులు చోరీకి పాల్పడ్డారు. విచారణలో కంఠం గ్రామానికి చెందిన లింగం, దేవేందర్‌పై నేరం రుజువు కావడంతో జడ్జి శిక్షను అమలు చేసినట్లు తెలిపారు.

శక్కర్‌నగర్‌లో ఒకరి ఆత్మహత్య

బోధన్‌టౌన్‌: పట్టణంలోని శక్కర్‌నగర్‌ కాలనీకి చెందిన గుండబోయిన స్వామి (45) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్‌ సోమవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

రైలు కింద పడి మరొకరు..

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి రైల్వే పీఎస్‌ పరిధిలోని వడియారం రైల్వే స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఘటనా స్థలాన్ని ఎస్సై తావూ నాయక్‌ పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని చెప్పారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.